

తెల్లవారటమే ఆలస్యమయింది అన్నట్టు అప్పుడే ఆ వార్తను ఆ వీధి అంత ఓ 'హాట్ కేకొ'లా పంచారు. ఎవరి నోట విన్నా ఆ వార్తే!

"గోపాలకృష్ణ గారి కూతురు 'రాజీ' కనిపించడం లేదట!"

"ఆఁ! ఎన్నాళ్ళింట్లో ఉంటుంది లెద్దూ! ఒకటా - రెండా ముప్పయిరెండేళ్ళొచ్చాయి. వాళ్ళ నాన్న దాని పెళ్ళి ఊసే ఎత్తడు. ఎప్పుడో ఒకప్పుడు ఇలా జరుగుతుం దనే అనుకున్నా నేను" అంటూ మాట్లాడుకుంటున్న అమ్మలక్కలు. వాళ్ళ కీ న్యూస్ కొన్నాళ్ళపాటు టైంపాస్.

"ఆఁ ఉప్పూ కారం తినే దేహం కదండీ! ఎన్నాళ్ళని కోరికలను అదుపులో ఉంచుకుంటారు?" ఇవి ఆ వీధిలో మగవారి మాటలు.

ఎవరు ఏమనుకునేదీ రాజీకి తెలీదు. రాజీ మాత్రం వెళ్ళిపోయింది. ఇక రాజీ తల్లితండ్రులు ఆ అమ్మాయి పెళ్ళి కోసం ఏ పూజలూ చేయనక్కర లేదు ఏ దేవుడికీ మొక్కుబడులు పెట్టనవసరం లేదు.

కాని వారి ముఖంలో నెత్తురు చుక్క లేదు. ఆ కుటుంబ సభ్యు

లందరిలో ఒకటే ప్రశ్న.

"రాజీ ఇలా చేసిందా?"

నోట్లో నాలుక లేని రాజీ, వల్లెత్తి ఎవ్వరినీ ఏ మాటా అనని, అడగని రాజీ ...! ఎప్పుడు? ఎక్కడ? ఏ మగాడితో చనువు పెంచుకుంది?

** ** **

కాలం మాత్రం తన కెవ్వరితో నిమిత్తం లే దన్నట్టు వారం రోజులు ముందుకు వెళ్ళింది. ఆ వారం రోజుల్లో ఆ వార్త ఊళ్ళో మూడొంతులు వ్యాపించిపోవడమూ జరిగింది. ఆ వార్త మీద చర్చ మాత్రం అమ్మలక్కల్లో నశేషంగా సాగుతూనే ఉంది.

మగవారు మాత్రం "ఏమండీ! ఎక్కడైనా అమ్మాయి కోసం వెతికించారా?" అని అడుగుతున్నారు.

"ఆ! మా బంధువుల ఊళ్ళ కంత అబ్బాయిలను పంపించాను. ఎక్కడా లే దని వచ్చారు" అని ఆ తండ్రి సమాధానం.

ఎనిమిదో రోజు వాళ్ళ ప్రశ్నలన్నిటికీ సమాధానమిస్తూ వచ్చేసింది ఓ ఉత్తరం.

"అమ్మా! నాన్నా! రాజక్కయ్య దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది" అని ఉత్సుకతతో గట్టిగా అరచిన కొడుకు గొంతు విని, ఒక్కసారి గుండె కొట్టుకోవడం నిలచిపోయి, తిరిగి చలించడం ప్రారంభించింది కుటుంబ సభ్యు లందరిలో. అందరూ విషయం వినడానికి అతని చుట్టూ చేరారు.

"ఏ ఊరి నుంచి రాసిందో చూడరా!"

"ఊరి పేరు రాయలేదు నాన్నా!"

"చిన్నగా చదువు." ముఖం మీద చిరు చెమట. ఉత్తరంలో ఏముంటుందో అనే భయం గోపాలకృష్ణగారిలో.

"అమ్మకు, నాన్నకు,

నమస్కారాలు. నేను ఇంట్లోంచి రావడం మీకు మనస్తాపాన్ని కలిగించడమే కాక, లోకానికి సమాధానం చెప్పలేకపోతున్నా రన్న విషయం కూడా ఊహించాను. లోకం దృష్టిలో నేను ఇప్పుడు 'లేచిపోయిన దాన్ని'. కాని మీరు కూడా ఆ మాటే నమ్ముతున్నారా నాన్నా? మీ రే విధంగా ఊహించినా మీ కూతురుగా నేను లోకం ఊహించేంత హీన స్థితికి మాత్రం దిగజారలేదు.

"కాని ఒక్క విషయం - నా మెడలో - నా చేతికి మీరు కట్టించిన తాయెత్తులకు స్వేచ్ఛనిచ్చాను. ఇప్పుడు మీకు ఏ బాధలూ లేకుండా చేశాను. నా కోసం ఏ పూజలూ చేయించనక్కర లేదు, ఏ సాధువులనూ మన ఇంటికి తీసుకు రానక్కరలేదు. ఏ బాబాల చుట్టూ తిరగనక్కరలేదు.

"నాన్నా! ఎంత నోరు విప్పనిదాన్నైనా నాకూ ఓ మనసుంటుందని, నా కంటూ కొన్ని అభిప్రాయా లుంటాయని మీరు ఊహించకపోవడం నా దురదృష్టం. పెళ్ళి కాకపోవడానికి కారణం మీరు ఊహించకుండా నా చేత పూజలు, ఉపవాసాలు చేయించారు. వీధిలో పోయే ప్రతి కొండ దొరను, కోయ దొరను పిలిపించి నా చేయి చూపించి, ధన సంపాదనకు అనేకం చెప్పేవాళ్ళు, నాకు ఆ 'గ్రహం' సోకింది, ఈ 'గ్రహం' ఉంది అంటే దాని కోసం తాయెత్తులు కట్టించారు. నాకు ఇష్టం లేకపోయినా మిమ్మల్ని బాధపెట్టలెక భరించాను. మానవ ప్రయత్నం లేనిది గాలిలో దీపం పెట్టి 'దేవుడా నీవే దిక్కు' అంటే నిలబడుతుందా నాన్నా? నా కోసం పెళ్ళి కాకుండా ఉన్న నా చెల్లెళ్ళు న న్నెంత అడ్డుగా భావించుకుంటున్నారో నాకు తెలును.

"మన ఊరికి ఎవరో సిద్ధురాలు వచ్చిందనీ, ఎక్కడో గుడిలో ఉందనీ, చేయి చూసి జరగబోయేవీ, మన మనసులో మనం అనుకునేవీ చెబుతుందని అమ్మతో అంటుంటే విన్నారు. నన్ను కూడా ఆవిడ దగ్గరకు తీసుకు వెళ్ళా లనుకుంటున్న మీ అభిప్రాయాన్ని గ్రహించాను. అప్పుడు నా మనసు నాకే ఎదురు తిరిగింది. ఇక ఏ బాబాలనూ దర్శించే శక్తి నాకు లేదు. ఏ తాయెత్తులూ కట్టించుకునే ఓపికా అంతకంటే లేదు. అందుకే ... అందుకే ఆ రోజు రాత్రే మీ రంత గాఢ నిద్రలో ఉన్నప్పుడు వచ్చేశాను.

"నేను పెద్దగా చదువుకోలేక పోవడం, మీరూ ఆడపిల్లను, పెద్ద పిల్లను ఇంట్లో పని కోసం చదువు మానిపించేయడం నా దురదృష్టం. ఇప్పుడు బాధపడుతున్నాను. ఆ కాస్త చదువుకే నా కో చిన్న బ్రతుకు తెరువు దొరికింది. ఇక్కడ నా చుట్టూ నా మీద ఆధారపడ్డ ఎంతో మంది పిల్లలు. వాళ్ళందరి మధ్యా, వారి ఆట పాటలు చూస్తూ ఆనందంగా ఉన్నాను.

"నాన్నా! జీవితానికి పరమార్థం పెళ్ళి చేసుకోవడమే కాదు. 'పెళ్ళి' జీవితంలో ఒక భాగం మాత్రమే. పెళ్ళే జీవితంగా బ్రతకకూడదు. దాని కోసం చావకూడదు. నాకు బ్రతుకు మీద బలీయమైన ఆశ ఉంది. ఇక్కడ నాకు దొరికిన ఈ ఉద్యోగంలో నాకు ఇష్టమున్నంతవరకూ ఉండొచ్చు. ఇష్టం లేకపోతే వెళ్ళిపోవచ్చు. నేను ఇక్కడే ఉండిపోవడానికి నిశ్చయించుకున్నా. అడ్రస్ మాత్రం ఇప్పుడే ఇవ్వను.

మన వీధిలో నా పైన కథ లల్లుతున్న వారికి చెప్పండి నాన్నా - పెళ్ళి కాని ఆడపిల్లను ఓ మనిషిగా చూడమనీ, తమ విషపు మాటలతో ఆ అమ్మాయిని బాధపెట్టవద్దనీ.

"తల్లి దండ్రులెప్పుడూ ఆడపిల్లను పెళ్ళి చేయడం కోసమే పెంచకూడదు నాన్నా! ఆ అమ్మాయిని స్వతంత్రంగా తన కాళ్ళపైన నిలబడే విధంగా, వ్యక్తిత్వం గల మనిషిగా తీర్చిదిద్దాలి. అప్పుడే పెంపకానికి సార్థక్యం. ఇలా రాసి మిమ్మల్ని బాధపెట్టడం నా అభిమతం కాదు. ఇంతకు రెట్టింపు బాధను ఎన్నో రాత్రులు నేను అనుభవించాను.

"ఈ ఉత్తరం మన వీధిలో ప్రతి ఒక్కరికీ చూపించండి. ఏ తల్లిదండ్రులైనా ఆడపిల్లను అలా పెంచగలిగితే నే నెంతో సంతోషిస్తాను.

"ఇక ఉంటాను

"మిమ్మల్నందర్నీ బాధపెట్టినందుకు క్షంతవ్యురాలిని.

"ఇట్లు రాజీ"

ఉత్తరం చదవడం ముగియగానే అందరి కళ్ళల్లో నీళ్ళు.

రాజీ 'తప్పు పని చేయలేదు' అనే భావంతో మనసు పొంగిపోతుండగా ఆ ఉత్తరం అందరికీ వినిపించాలని బయటికి వెళ్ళారు గోపాలకృష్ణగారు, గర్వంగా. ★




